ఆట | నమస్తే తెలంగాణ
హైదరాబాద్, సోమవారం 5 ఆగస్టు 2024
www.ntnews.com

# పతకానికి అడుగు దూరంలో..

**హాకీలో సెమీస్ చేరిన భారత్ • క్వార్టర్స్‌లో బ్రిటన్‌పై సంచలన విజయం • షూటౌట్‌లో తేలిన ఫలితం**



**ఒలింపిక్స్‌లో మరే దేశానికీ లేని ఘనమైన చరిత్ర కలిగి పునర్వైభవం దిశగా సాగుతున్న భారత హాకీ జట్టు 'పారిస్'లో సంచలన విజయాలతో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. గ్రూప్ దశలో అదరగొట్టి క్వార్టర్స్ చేరిన 'మెన్ ఇన్ బ్లూ'.. ప్రపంచ రెండో ర్యాంకర్ గ్రేట్ బ్రిటన్‌పై గెలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన క్వార్టర్స్ పోరులో నిర్దేశిత సమయానికి ఇరు జట్లూ చెరో గోల్‌తో సమానంగా ఉన్నా 'పెనాల్టీ షూటౌట్' ద్వారా తేలిన ఫలితంలో భారత్ అద్భుతమే చేసింది. 'డూ ఆర్ డై' పరిస్థితుల్లో మనోళ్లు 4 గోల్స్ కొట్టగా ప్రత్యర్థి జట్టు రెండింటికే పరిమితమైంది. గోల్ పోస్ట్ వద్ద పీఆర్ శ్రీజేష్ గోడ కట్టడంతో బ్రిటన్‌కు నిరాశ తప్పలేదు. 1972 తర్వాత ఒలింపిక్స్‌లో భారత్‌కు ఇది వరుసగా రెండో సెమీస్. టోక్యోలో మన కుర్రాళ్లు కాంస్య పతకాన్ని పట్టుకొచ్చిన విషయం విదితమే.**

పారిస్: 'టోక్యో'లో వచ్చిన కాంస్య పతకం రంగు మార్చాలని పట్టుదలతో ఉన్న భారత హాకీ జట్టు పారిస్ ఒలింపిక్స్‌లో ఆ దిశగా మరో కీలక ముందడుగు వేసింది. ఆదివారం జరిగిన క్వార్టర్స్‌లో భారత్ 1-1 (4-2)తో గ్రేట్ బ్రిటన్‌ను ఓడించి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఆటలో నిర్దేశిత సమయానికి ఇరు జట్లూ తలా ఒక గోల్ చేయడంతో మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌కు దారి తీసింది. షూటౌట్‌లో భారత్ 4 గోల్స్ చేయగా బ్రిటన్ రెండు మాత్రమే చేయగలిగింది. ఈ టోర్నీలో అత్యద్భుతమైన ఫామ్‌తో రెచ్చిపోతున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి రెండు గోల్స్‌తో సత్తా చాటాడు. ఇక బ్రిటన్ ఆటగాళ్ల గోల్ లక్ష్యాలను పదేపదే అడ్డుకుని వారికి 'అడ్డుగోడ'లా నిలబడ్డ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్ పోరాటం అయితే నభూతో నభవిష్యత్! క్వార్టర్స్‌లో గెలిచిన భారత్.. జర్మనీ-అర్జెంటీనా మధ్య జరిగే క్వార్టర్స్ పోరులో విజేతతో మంగళవారం సెమీస్‌లో తలపడనుంది.

## పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 19 | 15 | 11 | 45 |
| 2 | యూఎస్ఏ | 18 | 26 | 25 | 69 |
| 3 | ఫ్రాన్స్ | 12 | 14 | 17 | 43 |
| 4 | ఆస్ట్రేలియా | 12 | 10 | 7 | 29 |
| 5 | బ్రిటన్ | 10 | 12 | 15 | 37 |
| 6 | కొరియా | 10 | 7 | 7 | 24 |
| 57 | భారత్ | 0 | 0 | 3 | 3 |

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

### పది మందితోనే ఆడినా..

తొలి క్వార్టర్‌లో ఐదు నిమిషాల వ్యవధిలోనే బ్రిటన్‌కు రెండుసార్లు పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చినా వాటిని శ్రీజేష్ అడ్డుకున్నాడు. భారత్ కూడా మొదటి 15 నిమిషాల్లో 3 సార్లు వాటిని చేజార్చుకుంది. రెండో క్వార్టర్ మొదలైన రెండు నిమిషాలకే భారత డిఫెండర్ అమిత్ రోహిత్‌దాస్‌కు రిఫరీ రెడ్ కార్డ్ చూపించాడు. ప్రత్యర్థి జట్టు ఆటగాడైన విలియమ్ కల్నల్ తలపై ఉద్దేశపూర్వకంగా కొట్టాడని ఆరోపిస్తూ రిఫరీలు అతడిని బయటకు పంపించడంతో హర్మన్‌ప్రీత్ సేన మిగిలిన మ్యాచ్‌ను 10 మందితోనే ఆడింది. కీలక ఆటగాడు ఫీల్డ్‌లో లేకున్నా భారత్ నిరాశచెందలేదు. మూడో క్వార్టర్‌లో సుమిత్ కూడా గ్రీన్ కార్డ్ కారణంగా కొంతసేపు మైదానాన్ని వీడటం గమనార్హం. 22వ నిమిషంలో హర్మన్‌ప్రీత్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో భారత్ బోణీ కొట్టింది. అయితే రెండో క్వార్టర్ ముగియకుమందే 27వ నిమిషంలో లీ మోర్టన్ గోల్‌తో స్కోర్లు 1-1తో సమం అయ్యాయి. తర్వాత రెండు క్వార్టర్స్‌లోనూ ఇరు జట్లూ గోల్ చేయలేకపోయాయి. దీంతో మ్యాచ్ షూటౌట్‌కు వెళ్లింది.

### షూటౌట్ సాగిందిలా..

షూటౌట్‌లో బ్రిటన్ తరఫున అల్బరి జేమ్స్, వాలేస్ జాక్ రెండు గోల్స్ కొట్టారు. భారత్ నుంచి హర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్ గోల్స్ చేసి స్కోర్లను సమం చేశారు. మూడో గోల్ కోసం వచ్చిన విలియమ్సన్ కానర్ ప్రయత్నాన్ని శ్రీజేష్ అడ్డుకోవడంతో ఆ జట్టులో టెన్షన్ మొదలైంది. లలిత్ ఉపాధ్యాయ మూడో గోల్ చేసి భారత్‌ను 3-2తో ఆధిక్యంలోకి తెచ్చాడు. బ్రిటన్‌కు చివరి అవకాశంగా వచ్చిన రోపర్ ఫిలిప్ సైతం గోల్ చేయడంలో విఫలమయ్యాడు. కానీ రాజ్‌కుమార్ పాల్ బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి భారత్‌కు తిరుగులేని విజయాన్ని అందించాడు.

## అడ్డుగోడ శ్రీజేష్

తన సుదీర్ఘ కెరీర్‌లో భారత్ తరఫున చివరి టోర్నీ ఆడుతున్న దిగ్గజ గోల్‌కీపర్ శ్రీజేష్ మరోసారి భారత్‌కు హీరో అయ్యాడు. మ్యాచ్ ఆరంభం నుంచీ భారత డిఫెండర్లను దాటుకుని వచ్చిన బ్రిటన్ గోల్ ప్రయత్నాలను 36 ఏండ్ల శ్రీజేష్ విజయవంతంగా అడ్డుకున్నాడు. తొలి క్వార్టర్ 11వ నిమిషంలో సామ్యూల్ వార్డ్ పెనాల్టీ కార్నర్ ఆశలపై అతడు నీళ్లుచల్లాడు. ఇక రోహిత్‌దాస్ ఫీల్డ్ నుంచి వెళ్లాక అతడి బాధ్యతనూ తనే తీసుకున్నాడు. 32వ నిమిషంలో రూపర్ట్ షిప్పరీ కొట్టిన బంతిని కళ్లు చెదిరే రీతిలో ఆపాడు. ఆట మరో 4 నిమిషాల్లో ముగుస్తుందనగా 56వ నిమిషంలో మన డిఫెండర్లను చాకచక్యంగా తప్పించుకుని గోల్ పోస్ట్ దిశగా కదిలిన కల్నన్ ఆటలూ సాగనివ్వలేదు. ఇక షూటౌట్‌లో తొలి రెండు గోల్స్ మిస్ అయినా తర్వాత రెండింటినీ విజయవంతంగా అడ్డుకుని భారత్‌ను సెమీస్ చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు.




> నేను మైదానంలోకి దిగాక నా ముందు రెండే ఆప్షన్స్ కనబడ్డాయి. ఒకవేళ ఓడితే ఇదే నా చివరి మ్యాచ్. గెలిస్తే మరో రెండు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంటుంది. అమిత్ ఫీల్డ్ నుంచి వెళ్లగానే అతడి బాధ్యతలూ నేనే తీసుకున్నా. అతడు మా జట్టుకు ఆస్తి. ఇది జట్టు విజయం. నాకు మరో రెండు మ్యాచ్‌లు ఆడే అవకాశం దక్కింది. సెమీస్‌లోనూ ఇదే ప్రదర్శనను కొనసాగిస్తాం
> - పీఆర్ శ్రీజేష్

## సెమీస్‌లో తప్పిన 'లక్ష్యం'

**పోరాడి ఓడిన లక్ష్యసేన్**

**కాంస్య పోరుకు అవకాశం**



పారిస్: బ్యాడ్మింటన్‌లో స్వర్ణం లేదా రజతం గెలిచి చరిత్ర సృష్టించే అవకాశాన్ని భారత యువ షట్లర్ లక్ష్యసేన్ చేజేతులా జారవిడుచుకున్నాడు. ఒలింపిక్స్‌లో పురుషుల సెమీస్‌కు చేరిన తొలి భారత షట్లర్‌గా నిలిచిన లక్ష్యసేన్.. 20-22, 14-21తో విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడాడు. ఆదివారం 54 నిమిషాల్లోనే ముగిసిన సెమీస్ పోరులో తొలి సెట్‌ను త్రుటిలో కోల్పోయిన అతడు.. రెండో సెట్‌లో పుంజుకున్నా ప్రత్యర్థి దూకుడుతో పరాజయం వైపు నిలిచాడు. సెమీస్‌లో ఓడటంతో అతడు సోమవారం జరిగే కాంస్య పోరులో మలేషియా షట్లర్ లీ జి జియాతో అమీతుమీ తేల్చుకోనున్నాడు.



## బాక్సింగ్‌లోనూ నిరాశే

**క్వార్టర్స్‌లోనే లవ్లీనా నిష్క్రమణ • నిరాశపరిచిన అథ్లెట్లు**

విల్లెపింటె (నార్త్ పారిస్ ఎరీనా): ఒలింపిక్స్‌లో కచ్చితంగా పతకాలు వస్తాయని ఆశించిన బాక్సింగ్ క్రీడాంశంలోనూ భారత్‌కు తీవ్ర నిరాశే మిగిలింది. టోక్యోలో కాంస్యం గెలిచిన అసోం అమ్మాయి లవ్లీనా బొర్గొహెయిన్.. ఆదివారం జరిగిన మహిళల 75 కిలోల క్వార్టర్స్‌లో 1-4తో లి క్వియాన్ (చైనా) చేతిలో ఓడింది. దీంతో బాక్సింగ్‌లో భారత్ ప్రయాణం ముగిసినట్టైంది. నిఖత్ జరీన్, లవ్లీనా వంటి స్టార్ బాక్సర్లతో పాటు అమిత్ పంగాల్, నిషాంత్ దేవ్, జాస్మిన్ లంబోరియా, ప్రీతి పన్వర్ వంటి ఆరుగురు బాక్సర్లతో బరిలోకి దిగిన భారత్‌కు ఆశించిన ఫలితాలు మాత్రం రాలేదు. క్వార్టర్స్‌లో గెలిచుంటే లవ్లీనాకు ఏదో ఒక పతకం ఖరారయ్యేది.

### షూటింగ్‌లో..

పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో విజయ్‌వీర్ సిద్ధు, అనిష్ భన్వాలా క్వాలిఫికేషన్ రౌండ్‌లో రాణించినా ఫైనల్‌కు మాత్రం అర్హత సాధించలేకపోయారు. 92 స్కోరుతో విజయ్‌వీర్ 9వ స్థానం దక్కించుకోగా అనిష్ 13వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో టాప్-6లో ఉన్నవాళ్లు మాత్రమే ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు. మహిళల స్కీట్ పోటీలలో మహేశ్వరి చౌహాన్ 14, రైజా ధిల్లాన్ 23 స్థానాలతో ముగించారు.

### అథ్లెటిక్స్‌లో..

అథ్లెటిక్స్‌లో భారత అథ్లెట్ల నిరాశజనక ప్రదర్శన కొనసాగుతోంది. మహిళల 3వేల మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో పారుల్ చౌదరి 8వ స్థానంతో ముగించింది. పురుషుల లాంగ్ జంప్ (గ్రూప్-బి క్వాలిఫికేషన్)లో జెస్విన్ ఆల్డ్రిన్ 7.61 మీటర్లు దూకి 13వ స్థానంతో కనీసం ఫైనల్స్‌కు అర్హత కూడా సాధించలేకపోయాడు.



వాండర్సే (6/33)

## భారత్‌కు షాక్

**జెఫ్రీ వాండర్సే ధాటికి టీమ్ఇండియా కుదేలు**

**రెండో వన్డేలో లంక విజయం**

కొలంబో: శ్రీలంక పర్యటనలో ఉన్న భారత జట్టుకు ఊహించని షాక్ తగిలింది. స్పిన్‌కు సహకరిస్తున్న కొలంబో పిచ్‌పై అద్భుత బౌలింగ్‌తో తొలి వన్డేను డ్రా చేసుకున్న లంకేయులు.. రెండో వన్డేలోనూ అదే వ్యూహంతో టీమ్ఇండియాను దెబ్బకొట్టారు. ఆ జట్టు స్పిన్నర్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' జెఫ్రీ వాండర్సే (6/33) అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలతో భారత బ్యాటింగ్ ఆర్డర్ కకావికలమైంది. లంక నిర్దేశించిన 241 పరుగుల ఛేదనలో పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న టీమ్ఇండియా 42.2 ఓవర్లలో 208 పరుగులకే చేతులెత్తేసి 32 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. రోహిత్ శర్మ (44 బంతుల్లో 64, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) మరోసారి చెలరేగినా అక్షర్ పటేల్ (44) ఆదుకునే యత్నం చేసినా వాండర్సే, అసలంక (3/20) స్పిన్ మాయాజాలంతో ఆతిథ్య జట్టు అనూహ్య విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. అవిష్క ఫెర్నాండో (40), కమిందు మెండిస్ (40) రాణించారు. ఈ సిరీస్‌లో చివరి వన్డే బుధవారం జరుగనుంది. రెండో వన్డేలో ఓటమితో 1997 నుంచి లంక గడ్డపై వరుసగా 11 వన్డే సిరీస్‌లు గెలిచిన భారత జైత్రయాత్రకు తెరపడింది.

### వామ్మో వాండర్సే..

మోస్తరు ఛేదనను రోహిత్ సేన ధాటిగానే ఆరంభించింది. హిట్‌మ్యాన్, గిల్ (35) తొలి వికెట్‌కు 13 ఓవర్లలో 95 పరుగులు జోడించి శుభారంభాన్నే అందించారు. కానీ తన రెండో ఓవర్‌లో వాండర్సే.. రోహిత్‌ను బోల్తా కొట్టించడంతో వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టాడు. 17వ ఓవర్లో అతడు గిల్‌తో పాటు దూబెను ఔట్ చేయగా 19వ ఓవర్లో కోహ్లీ (14) కూడా వికెట్ల ముందు దొరికిపోవడంతో పర్యాటక జట్టు కష్టాలు రెట్టింపయ్యాయి. అదే క్రమంలో శ్రేయస్ అయ్యర్ (7), కెఎల్ రాహుల్ (0)ను ఔట్ చేసిన వాండర్సే భారత్‌ను కోలుకోనీయకుండా చేశాడు. ఈ క్రమంలో అక్షర్ ఆదుకునే యత్నం చేసినా అసలంక వేసిన 34వ ఓవర్లో అతడికే రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో అతడూ ఔటయ్యాడు. కొద్దిసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్న వాషింగ్టన్ సుందర్ (15)నూ అసలంక పెవిలియన్‌కు పంపడంతో భారత ఓటమి ఖరారైంది. ఒక దశలో 96/0గా ఉన్న భారత్.. వాండర్సే ధాటికి పది ఓవర్ల వ్యవధిలో 50 పరుగులు మాత్రమే జోడించి ఆరు వికెట్లు నష్టపోగా అవన్నీ అతడి ఖాతాలోకే వెళ్లడం గమనార్హం.

**3** భారత్‌పై వన్డేలలో ఆడుతూ ఓ లంక స్పిన్నర్‌కు ఇది మూడో అత్యుత్తమ ప్రదర్శన. మురళీధరన్ (7/30), అజంతా మెండిస్ (6/13) వాండర్సే కంటే ముందున్నారు.

## శరణార్థి కొత్త చరిత్ర



పారిస్: విశ్వక్రీడల్లో ఒలింపిక్ జెండా కింద ఆడుతున్న 'ఒలింపిక్ శరణార్థుల జట్టు'కు ప్రాతినిధ్యం వహిస్తున్న కామెరూన్ బాక్సర్ సిండి ఎంగంబ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన మహిళల 75 కిలోల బాక్సింగ్ క్వార్టర్స్‌లో ఎంగంబ 5-0తో అథీనా బైలొన్ (ఫ్రాన్స్)ను మట్టికరిపించింది. ఈ గెలుపుతో ఆమె ఒలింపిక్ రిఫ్యూజీ టీమ్‌కు మొదటి పతకాన్ని అందించేందుకు సిద్ధమైంది. సెమీస్‌లో గెలిచి తాను స్వర్ణం లేదా రజతం సాధిస్తానని మ్యాచ్ అనంతరం ఎంగంబ తెలిపింది.

## రెజ్లర్ల మీదే ఆశలన్నీ!

**నేటి నుంచే పోటీలు ప్రారంభం**



పారిస్: భారీ ఆశలతో పారిస్‌కు వెళ్లిన భారత క్రీడాకారుల బృందం ఆశించిన స్థాయిలో రాణించడంలో విఫలమవడంతో ఈ ఎడిషన్‌లో అయినా సాక్షాత్కారమవుతుందనుకున్న 'డబుల్ డిజిట్'పై నీలినీడలు కమ్ముకున్నాయి. భారత్ భారీగా పతకాలు ఆశించిన ఆర్చరీ, బాక్సింగ్, బ్యాడ్మింటన్‌లో మన క్రీడాకారులు దారుణంగా విఫలమవ్వగా షూటింగ్‌లో మను భాకర్ పుణ్యమా అని మూడు పతకాలు వచ్చాయి. అవి కూడా కాంస్యాలే. అథ్లెట్లు అయితే కనీసం క్వాలిఫికేషన్ రౌండ్లు కూడా దాటడం లేదు. హాకీలో ఇంకా పతకం ఖాయం కాకున్నా మనోళ్ల జోరు చూస్తే కచ్చితంగా మెడల్‌తోనే తిరిగొస్తారన్న అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ 'రెండంకెల పతకాల' లక్ష్యాన్ని సాధించాలంటే రెజ్లర్లు ఓ పట్టు పట్టాల్సిందే. ఒలింపిక్స్‌లో సోమవారం నుంచే రెజ్లింగ్ పోటీలు మొదలుకాబోతున్నాయి. తొలి రోజు నిషా దహియా, వినేశ్ పొగాట్, అంతిమ్ పంగల్ వంటి స్టార్ ప్లేయర్లు బరిలోకి దిగబోతున్నారు. రెజ్లింగ్‌లో భారత్‌కు గత నాలుగు ఎడిషన్లుగా మన మల్లయోధులు పతకాలు తీసుకురాగా పారిస్‌లోనూ ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలని యావత్ దేశం వేయి కండ్లతో వేచి చూస్తోంది.

## ఇమానె మహిళే!

**తేల్చి చెప్పిన తండ్రి**



అల్జీర్స్: ఒలింపిక్స్‌లో వివాదాస్పద బాక్సర్‌గా ముద్రపడ్డ ఇమానె ఖెలిఫ్ మహిళనా? లేక పురుష లక్షణాలు ఉన్న అబ్బాయా? అన్న చర్చలు జోరుగా సాగుతున్న వేళ ఇదేవిషయమై ఆమె తండ్రి ఒమర్ ఖెలిఫ్ స్పష్టతనిచ్చాడు. 'ఎక్స్' వేదికగా ఆయన స్పందిస్తూ.. 'నా బిడ్డ అమ్మాయే. అందుకు సంబంధించి ఆమె జనన ధృవీకరణ పత్రంతో పాటు పూర్తి ఆధారాలూ మావద్ద ఉన్నాయి. ఆమె దృఢమైన అమ్మాయి. చిన్ననాటి నుంచీ ధైర్యంగా ఉండటం, కష్టపడటం నేర్పించాం. ఇటాలియన్ బాక్సర్ కంటే దృఢంగా ఉండటం వల్లే ఆమెను ఓడించింది..' అని అన్నాడు.

## జొకోవిచ్‌దే స్వర్ణం

**ఫైనల్‌లో ఓడిన అల్కారజ్**



పారిస్: పురుషుల టెన్నిస్‌లో రారాజు తానేనని నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) మరోసారి నిరూపించుకున్నాడు. గత ఏడాదికాలంగా తనను 25వ గ్రాండ్‌స్లామ్ అందుకోకుండా అడ్డుపడుతున్న స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కారజ్‌ను ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో ఓడించి బదులు తీర్చుకున్నాడు. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్స్‌లో జొకోవిచ్ 7-6 (7/3), 7-6 (7-2)తో అల్కారజ్‌ను చిత్తు చేసి తన కెరీర్‌లో తొలిసారి ఒలింపిక్స్ పసిడిని ముద్దాడాడు. సుదీర్ఘ కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన జొకో ఖాతాలో ఇప్పటికే ఒలింపిక్స్ కాంస్యం (2008) కూడా ఉంది. ఫైనల్‌లో ఓడిన అల్కారజ్ రజతం గెలుచుకోగా ఇటలీ ఆటగాడు లొరెంజొ ముసెట్టికి కాంస్యం దక్కింది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.